ప్రజల ప్రాణాలతో చెలగాటం

- బాన్సువాడలో కల్తీ నూనెలతో తినుబండారాల తయారీ
- జోరుగా కొనసాగుతున్న కల్తీ వ్యాపారం
- తనిఖీలు చేపట్టని అధికారులు



బాన్సువాడ: బతుకమ్మ, దసరా, దీపావళి, సంక్రాంతి పండుగల నేపథ్యంలో బాన్సువాడ ప్రాంతంలో వ్యాపారులు కల్తీ నూనెను నిల్వ చేస్తున్నారు. అరికట్టాల్సిన ఆహార నియంత్రణ తూనికలు, కొలతల శాఖల అధికారులు తనిఖీలు చేపట్టకపోవడంతో ఈ కల్తీ మాఫియాకు అడ్డూఅదుపు లేకుండా పోతోందన్న విమర్శలున్నాయి. గతంతో జరిపిన తనిఖీల్లో కల్తీ నూనె వెలుగు చూసినా పండుగలకు ముందు తనిఖీలు చేయకపోవడం గమనర్హం. బాన్సువాడ పట్టణంలో కల్తీ నూనెలతో చిప్స్ తయారు చేస్తూ చిన్నారుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. కుళ్లిపోయిన ఆలుగడ్డలను తీసుకువచ్చి చిప్స్ తయారు చేస్తున్నారు. దీనికి తోడు కల్తీ నూనెతో చిప్స్ తయారు చేస్తున్నారు. కల్తీ నూనెతో తయారు చేసిన చిప్స్ ప్యాకెట్లను ప్రతి రోజూ స్వీట్ హోంలో విక్రయిస్తున్నారు. గతంలో ఫుడ్ సేఫ్టీ అధికారులు వచ్చి చిప్స్ తయారు చేసే కేంద్రాన్ని తనిఖీ చేశారు. చిప్స్ తయారీకి వాడే నూనె అసలా.? కల్తీ అనే తేల్చేందుకు ల్యాబ్‌కు పంపించారు. కానీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో నిర్వాహకుల మాత్రం మళ్లీ అదే తరహాలో అదే నూనెను వాడుతూ చిప్స్ తయారు చేస్తున్నారు.

పొరుగు రాష్ట్రాల నుంచి కల్తీ సరుకు..

బాన్సువాడ ప్రాంతం కర్ణాటక, మహారాష్ట్ర సరిహద్దులో ఉండడంతో ఆయా రాష్ట్రాల నుంచి కల్తీ నూనెలను బాన్సువాడ ప్రాంతానికి తరలిస్తున్నట్లు తెలిసింది. పండుగ సమయంలో అక్రమార్కులు తక్కువ ధరకే వివిధ రకాల నూనెలను కొనుగోలు చేసి, నాణ్యమైన నూనెలను తక్కువ మొత్తంలో తీసుకొని కలిపేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఏటా బతుకమ్మ, దసరా, దీపావళి, సంక్రాంతి, తొలి ఏకాదశి పండుగ సమయాల్లో పొద్దుతిరుగుడు, పల్లి నూనె పేరిట విక్రయిస్తున్నారనే చర్చ జరుగుతుంది. ఆయా శాఖల అధికారులతో ముందే ఒప్పందాలు కుదుర్చుకొని తనిఖీలు లేకుండా జాగ్రత్త పడుతున్నారని, సీజన్ ముగిశాక అరకొరగా దుకాణాల్లో తనిఖీలు నిర్వహించాలని వారే సూచిస్తున్నారని సమాచారం. డివిజన్‌లోనే అతిపెద్ద సంతగా బాన్సువాడ వారాంతపు సంతకు పేరుంది. ప్రతి గురువారం నిర్వహించే సంతకు గిరిజన తండాలు, చుట్టు పక్కల గ్రామాల నుంచి వేలాది మంది ప్రజలు సంతకు వస్తారు. మహారాష్ట్ర నుంచి పప్పులు, నూనెను బాన్సువాడకు తీసుకొచ్చి విక్రయిస్తారు. గ్రామీణ ప్రాంత ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని కల్తీ నూనెను అంటగడుతున్నారు. కిరాణ దుకాణాల్లో లభించే కల్తీ నూనె డివిజన్‌లోని ఓ మండల కేంద్రం నుంచి రవాణా చేస్తున్నట్లు సమాచారం.

తనిఖీలు శూన్యం..

ఆహార తనిఖీ విభాగం ప్రతి నెలా తప్పనిసరిగా తనిఖీలు నిర్వహించాల్సి ఉంటుంది. గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్లకు ఒక్కొక్కరికి నిర్ణీత లక్ష్యం ఉంటుంది. కానీ కల్తీ నూనెలకు నిలయంగా మారిన బాన్సువాడ ప్రాంతంలో మామూలుగానే తనిఖీలు చేస్తున్నట్లు విమర్శలున్నాయి. ప్రతి నెలా క్రమం తప్పకుండా ఆహార తనిఖీ విభాగం తనిఖీలు చేస్తే కల్తీ నూనె కట్టడి చేయవచ్చునని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

మళ్లీ విచారణ చేయిస్తాం

బాన్సువాడలో చిప్స్ తయారీకి కల్తీ నూనె వాడుతున్నట్లు గతంలో ఫిర్యాదు వచ్చింది. ఆయిల్ శ్యాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపించాం. రిపోర్టు వచ్చాక తదుపరి చర్యలు తీసుకుంటాం. చిప్స్ తయారీ కేంద్రాన్ని సందర్శించినప్పుడు నిర్వాహకులకు కొన్ని నిబంధనలు సూచించాం. నిబంధనలు పాటించకుంటే జరిమానా విధిస్తాం.

– సునీత, ఫుడ్ ఇన్‌స్పెక్టర్, కామారెడ్డి

క్లుప్తంగా

బతుకమ్మ ఏర్పాట్ల పరిశీలన



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణంలోని పలు ప్రాంతాలలో బతుకమ్మ ఏర్పాట్లను మున్సిపల్ సిబ్బంది బుధవారం పరిశీలించారు. పట్టణంలోని ఆజాద్ గ్రౌండ్, కొచ్చెరువు ప్రాంతాలలో బతుకమ్మ ఏర్పాట్లను పరిశీలించారు. అక్కడ ఉన్న పొదలను తొలగించాలని సిబ్బందికి అధికారులు సూచించారు. వార్డు ఆఫీసర్ ఆంజనేయులు, నుసుగొండ శ్రీనివాస్, పప్పు వెంకటేశం తదితరులున్నారు.

చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి



ఎల్లారెడ్డిరూరల్: చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని సీడీపీవో స్వరూపారాణి అన్నారు. బుధవారం ఎల్లారెడ్డి పట్టణంలోని కిరాణ వర్తక సంఘం భవనంలో పౌష్టికాహార వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట, గాంధారి, లింగంపేట మండలాలకు చెందిన అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ఏసీడీపీవో ప్రసన్న, సూపర్‌వైజర్లు తదితరులున్నారు.

పేదోడి కల సాకారం



లింగంపేట(ఎల్లారెడ్డి): పేదోడి కల సాకారం కావడానికి తెలంగాణ ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తుందని ఎంపీడీవో నరేష్ అన్నారు. బుధవారం ఆయన కొర్పోల్‌లో పలువురికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందజేశారు. నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు వరం లాంటిదన్నారు. ఇళ్లకు మార్కింగ్ ఇచ్చారు. లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలు వేగవంతం చేయాలని సూచించారు.

పుస్తక నిర్వహణపై శిక్షణ



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో బుధవారం మండల సమాఖ్య ఆధ్వర్యంలో పుస్తక నిర్వహణపై వీవోఏలకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి డీఎంజీ రామచందర్ మాట్లాడుతూ.. గ్రామ సంఘం రికార్డులను పకడ్బందీగా భద్రపరచాలని వీవోఏలను కోరారు. గ్రామ సంఘాల సమావేశాలను గ్రామస్థాయిలో సక్రమంగా నిర్వహించి ఆదాయ అభివృద్ధి కార్యక్రమాలను ప్రోత్సహించాలని సూచించారు. ఏపీఎం ప్రసాద్, మండల సమాఖ్య అధ్యక్షులు బాలంబాయ్, సీసీలు అంజాగౌడ్, ప్రతాప్, భూమయ్య, ఆంజనేయులు, నరేందర్ రెడ్డి, రాజు అకౌంటెంట్ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



మాచారెడ్డి: బహుజన లెఫ్ట్ ఫ్రంట్ యూనియన్ మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను బుధవారం పాల్వంచ మండల కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీఎల్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సిద్ధిరాములు మాట్లాడుతూ.. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా కేంద్రంలో అక్టోబర్ 11,12 తేదీలలో బీడీ కార్మికుల సమస్యలపై నిర్వహించనున్న రాష్ట్ర రెండో మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. నేతలు ఎల్లయ్య, దుర్గయ్య, ఆంజనేయులు, నిశిత ఉన్నారు.

సాంస్కృతిక శాఖ డైరెక్టర్‌ను కలిసిన తెరవే జిల్లా అధ్యక్షుడు



కామారెడ్డి అర్బన్: తెలంగాణ రచయితల వేదిక(తెరవే) జిల్లా అధ్యక్షుడు సిరిసిల్ల గఫూర్ శిక్షక్ బుధవారం రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్‌గా నియమితులైన ఏనుగు నర్సింహారెడ్డిని కలిసి సన్మానించారు. తెలంగాణ సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన కవి సమ్మేళనంలో గఫూర్ శిక్షక్ పాల్గొన్నారు. తన రచన 'ధైర్య కవచం' పుస్తకాన్ని ఆయనకు అందజేశారు.

బాలికల వసతి గృహం ప్రారంభం



భోగ్ బండారులో పాల్గొన్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి

నస్రుల్లాబాద్: దుర్కి గ్రామంలో నూతనంగా నిర్మించిన గిరిజన గురుకుల బాలిక వసతి గృహాన్ని మంగళవారం రాష్ట్ర వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా బంజారా నాయకుల ఏర్పాటు చేసిన భోగ్ బండార్ కార్యక్రమంలో పాల్గొని జగదాంబ మాత, సేవాలాల్ మహారాజ్‌లకు పూజలు నిర్వహించారు. దీనిలో భాగంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని పోచారం విద్యార్థులతో మాట్లాడారు. బాన్సువాడను ఎడ్యుకేషన్ హబ్‌గా మార్చాలనే పని చేస్తున్నామన్నారు. గిరిజన ఇంటర్, డిగ్రీ విద్యార్థినులకు వసతి గృహం లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారని అందులో భాగంగానే ఈ భవనం ఏర్పాటు చేశామన్నారు. ఆయన వెంట రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాల్‌రాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ దుర్గం శ్యామల, మాజీ ఎంపీపీ పాల్త్య విఠల్, నాయకులు ప్రతాప్, మోహన్ నాయక్, వీరేషం, తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డులా బస్టాండ్ రోడ్డు



కామారెడ్డి అర్బన్: కామారెడ్డి కొత్త బస్‌స్టేషన్ ప్రహరీని ఆనుకుని రాధాకృష్ణ లాడ్జ్ వైపు రోడ్డులో మున్సిపల్ కార్మికులు చెత్త సేకరణ చేయడం లేదని స్థానికులు చెబుతున్నారు. బస్టాండ్ పక్కనే ఉండటం.. చెత్త పేరుకుపోవడంతో ప్రయాణికులు మలమూత్రాలు చేస్తున్నారని.. కనీసం వారానికి ఒక సారైనా చెత్తను అక్కడి నుంచి తరలించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. డంపింగ్‌యార్డులా ఆ రోడ్డును మారుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కొద్దిరోజులకే నిరుపయోగం



సదాశివ నగర్ (ఎల్లారెడ్డి): మండలంలోని వజ్జపల్లిలో ఇటీవల ఏర్పాటు చేసిన ఎల్ఈడీ బల్బులు వెలగక పోవడంతో మూడ్నాళ్ల ముచ్చటగా తయారైందని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బల్బులను ఏర్పాటు చేసిన కొద్ది రోజుల్లోనే అవి నిరుపయోగంగా మారడంతో గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

దుర్గామాతకు ప్రత్యేక పూజలు

సాక్షి నెట్‌వర్క్: దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారు అన్నపూర్ణ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు. మహిళలు కుంకుమార్చనలు నిర్వహించారు. భజన కీర్తనలు ఆలపించారు. భక్తులకు అన్నదానాలు చేశారు. పలు గ్రామాల్లో అమ్మవారి మండపాల వద్ద మహిళలు రాత్రి వేళల్లో కోలాటం ఆడారు.



మాగి దుర్గామాత మండపం వద్ద కుంకుమార్చన చేస్తున్న మహిళలు



దోమకొండలోని కపిల్ యూత్ దుర్గామాత మండపం వద్ద..



నస్రుల్లాబాద్ దుర్గాదేవి మండపం వద్ద హోమం



కిచ్చన్నపేటలో..



ఇబ్రహీంపేట్‌లో పూజలందుకుంటున్న దుర్గామాత



తాడ్వాయిలోని ఆద్య సేన ఆధ్వర్యంలో దుర్గా మాత వద్ద పూజలో పాల్గొన్న కుమారీలు



సదాశివనగర్: ముదిరాజ్ దుర్గామాత మండపం వద్ద కీర్తనలు ఆలపిస్తున్న భజన మండలి సభ్యులు



కొత్త బాన్సువాడలో అన్నపూర్ణ దేవిగా దర్శనమిస్తున్న కోటదుర్గమ్మ

రోడ్లకు మరమ్మతులు ఏవీ..?

పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండలంలోని బేగంపూర్ చౌరస్తా జాతీయ రహదారి–161 నుంచి బేగంపూర్ గ్రామానికి వెళ్లే రోడ్డు తీవ్రంగా దెబ్బతినడంతో రాకపోకలకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ రోడ్డుపై ప్రయాణాలు కొనగిస్తూ ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేయించాలని వాహనదారులు కోరుతున్నారు.



అధ్వానంగా ఉన్న బేగంపూర్ చౌరస్తా నుంచి బేగంపూర్ గ్రామానికి వెళ్లే రోడ్డు

డోంగ్లీలో ప్రమాదకరంగా గుంతలు



డోంగ్లీలో రహదారిపై ఏర్పడిన గుంతలు

మద్నూర్(జుక్కల్): డోంగ్లీ తహసీల్ కార్యాలయం వద్ద ప్రధాన రహదారిపై గుంతలు ఏర్పడ్డాయి. వర్షం పడినప్పుడు ఈ రోడ్డు చెరువులాగా మారుతోంది. వాహనదారులు రోడ్డుపై గుంతలను గమనించక ప్రమాదానికి గురవుతున్నారు. వర్షకాలం కావడంతో గుంతల్లో నీరు నిలిచి చెరువులను తలపిస్తున్నాయి. అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.



డోంగ్లీ తహసీల్ కార్యాలయం వద్ద..

తెగిపోయిన ముత్యంపేట- భవానీపేట రోడ్డు



దోమకొండ: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. ముఖ్యంగా దోమకొండ మండల కేంద్రం నుంచి ముత్యంపేట, గొట్టిముక్కల, సంఘమేశ్వర్ గ్రామాలకు వెళ్లే రోడ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. దోమకొండ మండలం ముత్యంపేట నుంచి మాచారెడ్డి మండలం భవానిపేట వెళ్లే బీటీ రోడ్డు పూర్తిగా తెగిపోయింది. ఈ మార్గంలో వెళ్లే వారు బాగా ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి దెబ్బతిన్న రోడ్లను బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

వడ్డెర స్వాతి సంఘం కార్యవర్గం ఎన్నిక



లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రానికి చెందిన వడ్డెర స్వాతి సంఘం కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఒడ్డె రాములు, ఉపాధ్యక్షుడిగా ఒడ్డె రాజు, ప్రధాన కార్యదర్శిగా ఒడ్డె రమేశ్, కోశాధికారిగా ఒడ్డె చందు, సభ్యుడిగా ఒడ్డె మహేష్, సలహాదారుడిగా ఒడ్డె పోచయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

జుక్కల్‌కు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని వినతి



నిజాంసాగర్(జుక్కల్): వెనుకబడిన ప్రాంతంగా ఉన్న జుక్కల్ నియోజకవర్గానికి ప్రత్యేక ప్యాకేజీ మంజూరు చేస్తూ అభివృద్ధికి సహకరించాలని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు కోరారు. బుధవారం ఢిల్లీలో మంత్రిని ఎమ్మెల్యే కలిసి వినతి పత్రం అందజేశారు. ఆయన వెంట ఎన్ఆర్ఐ భుజంగారి భాస్కర్ రెడ్డి తదితరులున్నారు.

బ్లాక్ మెయిల్ చేసిన ఉద్యోగిపై చర్యలు తీసుకోవాలి

కామారెడ్డి టౌన్: కిరాణ సామగ్రి కొనుగోలు చేసి కల్తీ వస్తువులంటూ బెదిరించిన ప్రభుత్వ ఉద్యోగిపై చర్యలు తీసుకోవాలని జిల్లా కేంద్రంలోని సూపర్ మార్కెట్ యజమాని పప్పుల శ్రీకాంత్ బుధవారం కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. తినకూడనివి, పూజకు వాడే నల్ల నువ్వులు కొనుగోలు చేసుకుని అవి కల్తీ నువ్వులని ఉద్యోగి తమను బెదిరించాడని తెలిపారు. డబ్బులు అడగటం, బెదిరించిన ఆధారాలు సీసీ టీవీ ఫుటేజీలో రికార్డయ్యాయని తెలిపారు. విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు.

మొదలైన జెండా ఉత్సవ పనులు

రాజంపేట : మండల కేంద్రంలో ప్రతి సంవత్సరం దసరా ఉత్సవాల్లో భాగంగా గ్రామ చావడి వద్ద జెండా పండుగ కార్యక్రమాన్ని ప్రత్యేకంగా నిర్వహిస్తారు. గ్రామంలోని పెద్దలు, కుల సంఘాల పెద్దలు ఈ కార్యక్రమంలో భాగస్వాములై చావడి వద్ద త్రివర్ణ పతాకాన్ని ఎగురవేస్తారు. బుధవారం జెండా దించే కార్యక్రమం ప్రారంభించినట్లు తెలిపారు. ఈ యేడు 60 ఫీట్ల ఎత్తు గల కర్ర సహకారంతో జెండాను ఆవిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. గ్రామ పెద్దలు కాసం రామిరెడ్డి, సాయిబాబా పటేల్, కుల సంఘాల పెద్దల పాల్గొన్నారు.



రాజంపేటలో సమావేశమైన గ్రామపెద్దలు

సమాచారం..

నేడు మండల సమాఖ్య సమావేశం

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో గురువారం మండల సమాఖ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఐకేపీ ఏపీఎం రాజు తెలిపారు. ఉదయం 10 గంటలకు మండల సమాఖ్య అధ్యక్షులు సుజాత అధ్యక్షతన ఈ సమావేశం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. అన్ని గ్రామ సంఘాల అధ్యక్షులు, సీసీలు, సిబ్బంది సకాలంలో హాజరు కావాలని కోరారు.

రేపు తాడ్వాయి కళాశాలలో తల్లిదండ్రులు, అధ్యాపకుల సమావేశం

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 26న విద్యార్థుల తల్లిదండ్రులు, అధ్యాపకుల సమావేశం నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ సయ్యద్ యూసుఫ్ హుస్సేన్ తెలిపారు. ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని, కళాశాలలో చదివే విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, అధ్యాపకులు సకాలంలో తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

పాల్వంచ బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం



మాచారెడ్డి: పాల్వంచ మండల బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశాన్ని ఈనెల 26న పాల్వంచ మండల కేంద్రంలోని ఆర్ఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్నట్లు మాచారెడ్డి బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బాల్‌చంద్రం తెలిపారు. బుధవారం మాచారెడ్డిలో ఆయన మాట్లాడుతూ.. కార్యకర్తల సమావేశానికి మాజీ విప్ గంప గోవర్ధన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబొద్దీన్, మాజీ జెడ్పీటీసీ రాంరెడ్డిలు హాజరవుతున్నట్లు తెలిపారు. నాయకులు రాజాగౌడ్, నర్సింలు, హేమ్లానాయక్, ఎజాజ్ ఉన్నారు.

సంక్షిప్తం

పెండింగ్ బిల్లులను తక్షణమే విడుదల చేయాలి



రాజంపేట: గత 21 నెలలుగా పెండింగ్‌లో ఉన్న అడ్మినిస్ట్రేటివ్ బిల్లుల తక్షణ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎంపీడీవో బాలకృష్ణకు బుధవారం ఉపాధి హామీ సిబ్బంది వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత ఆర్థిక సంవత్సరం నుంచి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం వరకూ తమ జీతాల నుంచే ఖర్చు చేశామని, ఇందులో 90 శాతం వరకు ఖర్చు కంప్యూటర్ ఆపరేటరేటర్–అకౌంట్స్ అసిస్టెంట్స్‌లపై భారం పడిందని, వచ్చే చిన్న జీతాలు, అవి కూడా ఆలస్యంగా రావడం వల్ల తాము తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. బిల్లులు తక్షణమే విడుదల చేయాలని కోరారు.

ఆర్థిక సహాయం



కామారెడ్డి రూరల్: ఇస్రోజీవాడిలో కాంగ్రెస్ కార్యకర్తల కుటుంబాలను బుధవారం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి పరామర్శించారు. గ్రామానికి చెందిన మచ్చ సాయిలు, మాదాని రాజయ్య తల్లి బాలవ్వ, దుబ్బాక పెద్ద గంగయ్య, పల్వంచ పెద్ద గంగయ్యలు కొన్ని రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఒక్కో కుటుంబానికి రూ.10 వేల చొప్పున ఆర్థిక సహాయం చేశారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు పంపరి శ్రీనివాస్, పిడుగు సాయిబాబా, సలీం, మామిండ్ల రమేష్, గ్రామ కాంగ్రెస్ నాయకులు గౌరు నవీన్‌కుమార్, మాదాని శంకర్, చిన్న మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

జువ్వాడి శివారులో పంటల పరిశీలన



గాంధారి(ఎల్లారెడ్డి): జువ్వాడి శివారులో బుధవారం క్షేత్రస్థాయిలో పంటలను ఏవో రాజలింగం పరిశీలించారు. మొక్కజొన్న, సోయాబీన్, కంది పంటలను పరిశీలించి సాగు చేసిన పంటలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారా లేదా అని తనిఖీ చేసినట్లు తెలిపారు. ఏఈవో విఘ్నేష్, రైతులున్నారు.